రోడ్డు భద్రతతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి - కడప అర్బన్

కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఆదేశాలు, ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్యక్రమాలు చేపట్టారు. పోలీస్ అధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు: మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు వేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

ఆడబిడ్డ నిధి కోసం నిరీక్షణ

- 17 నెలలైనా అమలుకు నోచుకోని వైనం

- అక్కాచెల్లెమ్మలను మోసం చేశారన్న ఆరోపణలు

- ఆందోళనలో మహిళలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగనే 18 నుంచి 59 ఏళ్ల లోపు వయసు మహిళలందరికీ ఆడబిడ్డ నిధి పథకం అమలు చేసి ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 నేరుగా ఖాతాలో జమ చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ప్రతి బహిరంగ సభలో హామీ ఇచ్చారు. ఆ మాటలు నమ్మి చాలా మంది అక్కా చెల్లెమ్మలు ఓటేశారు. అయితే ఏం లాభం? చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు కావొస్తున్నా.. ఆడబిడ్డ నిధి పథకం అమలుపై మంత్రివర్గ భేటీలో ఇంతవరకు ఒక్కసారి కూడా చర్చకు రాలేదు. అంటే ఈ పథకం కూడా గాలిలో కలిపేసినట్లేనా అనే సందేహం అక్కచెల్లెమ్మల్లో నెలకొంది. అధికారం కోసం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అంటూ బహిరంగ సమావేశాల్లో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇస్తామని ఊదరగొట్టారు. కానీ, అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని మరుస్తున్నారు.ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ గుప్పించారు. ఇంతవరకూ ఈ పథకంపై ఎటువంటి స్పష్టత ఇవ్వ లేదు. ఎంతో ముఖ్యమైన ఆడబిడ్డ నిధి పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారని మహిళలు ప్రశ్నిస్తు న్నారు. జిల్లాలో 11 లక్ష మందికి పైగా మహిళలు ఉన్నారు. అర్హులైన 7 లక్షల మందికి పైగా ఈ పథకం కోసం ఆశగా ఎదురుచూ స్తున్నారు.

సూపర్‌సిక్స్‌లో కీలకమైన 'ఆడబిడ్డ నిధి'

పథకాన్ని అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. త్వరలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించబోతోందని వార్తలు వచ్చాయి. బడ్జెట్‌లో ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.3,300 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆడబిడ్డ నిధి పథకం కోసం ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో నేరుగా అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని www.gramaward sachivalay. ap.gov.in వెబ్‌సైట్ ఇచ్చారు. ఇది ఇంకా పనిచేయలేదని సచివాల సిబ్బంది తెలుపుతున్నారు.

ఆడబిడ్డ నిధికి అర్హత.. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలి, పది ఎకరాలకు భూమి మించి ఉండరాదు, నాలుగు చక్రాల వాహనం కలిగి ఉండరాదు, 300 యూనిట్ల కంటే కరెంట్ బిల్లు ఎక్కువ ఉండకూడదు. ఇంటిలో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు. ఐటి రిటర్న్ చేయకూడదు. తదితర నిబంధనలను పెట్టారు. కానీ దీనిపై పూర్తి అధ్యయనం ఇంతవరకు జరగలేదని అధికారులు చెబుతున్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

ఎన్నికల సమయంలో మహిళలకు మాయమాటలతో మభ్య పెట్టకుండా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. ఆడబిడ్డ నిధిపథకం అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమే. కూటమి నేతలు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారే కానీ పథకాల గురించి పట్టించుకో వడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం పథకం అమలు చేసి మహిళల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.

- సుజాత, గృహిణి, పులివెందుల

మోసం చేయడం తగదు

అధికారంలోకి రాక ముందు ఒకలా.. వచ్చాక మరోలా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మహిళలను మోసం చేయడం తగదు. వచ్చే ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతాం. ఎన్నికల సమయంలో కూటమి నేతలు 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చారు.

- రూపదేవి, గృహిణి, పులివెందుల

లేబర్ కోడ్‌ల అమలు ఆపాలి

- లేబర్ కోడ్ల నోటిఫికేషన్ పత్రాల దహనంలో నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెస్తూ తీసుకొచ్చిన ఉత్తర్వుల అమలు ఆపాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌టిసి బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ కార్మిక చట్టాలకు వలస పాలన వాసనలు ఉన్నాయని, వాటిని ఆధునీకకరించి అమలు చేసేందుకే నాలుగు లేబర్ కోడ్లు తెస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నదంతా అబద్ధమని పేర్కొన్నారు. వలస పాలనకు మించి కార్పొరేట్ కంపెనీలకు కార్మిక వర్గం బానిసత్వంగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్లలో అనేకమైన కార్మిక వ్యతిరేక మార్పులను చొప్పించారని ఆరోపించారు. ఏదైనా పరిశ్రమ, కర్మాగారం కంపెనీ లే-ఆఫ్, లాకౌట్ చేయాలన్న 100 మంది అంతకుమించి కార్మికులు ఉంటే ఆ సంస్థ తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనే నిబంధనను ఇప్పుడు ఈ షరతు 300 మంది కార్మికులు ఉన్న కంపెనీలకు, పరిశ్రమలకు వర్తించే విధంగా మార్చారని పేర్కొన్నారు. 300 లోపు కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీలు, కంపెనీల యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించవచ్చన్నారు. అవసరమైతే లాకౌట్లు, మూసివేస్తామని బెదిరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తాయని చెప్పారు. కార్మిక వర్గానికి మేలు చేస్తాయని గొప్పలు చెబుతున్న మోడీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలకు 13 గంటలకు పెంచడమా, రాత్రి వేళల్లో మహిళా కార్మికులతో పరిశ్రమలలో పనిచేయించడమా అని ప్రశ్నించారు. . కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కెసి.బాదుల్లా, నగర కార్యదర్శి ఉద్దె మద్దిలేటి, జిల్లా కార్యదర్శి లింగన్న, హుస్సేన్, ఖాదర్ వల్లి, నారాయణ, సుబ్బరాయుడు, మల్లికార్జున, ఎస్. గౌస్, సునీల్ సిపిఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి వెంకటసుబ్బయ్య నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి నాలుగు నల్ల లేబర్ కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సిఐటియు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నగిరి భైరవ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలులోనికి తెస్తూ ఉత్తర్వులు ఇవ్వడము చాలా దుర్మార్గమని వారు అన్నారు. 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు గౌసియా బేగం, కార్మిక నాయకులు రవి, హంద్రీయ, బేబీ, మేరీ, ఓబులమ్మ హుస్సేన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. లేబర్ కోడ్ ను అమలు చేయవద్దు **జమ్మలమడుగు :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలులోకి తెస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే ఉపసంహరించు కోవాలని సీఐటీయూ అనుబంధం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ గౌరవాధ్యక్షులు ఏ.వినయ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులతో కలిసి లేబర్ కోడ్ అమలు వల్ల కలిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఉత్తర్వు కాపీలను దగ్ధం చేస్తున్న సిఐటియు, ఎఐటియుసినాయకులు

కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్

ప్రజాశక్తి- కడప అర్బన్

గత ప్రభుత్వం ఇచ్చిన 6 వేల కానిస్టేబుల్ పోస్టులలో ప్రిలిమ్స్ పాసై మెయిన్స్‌లో అర్హత సాధించి ఉద్యోగాల కోసం వేచి చూస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం కడప ఆర్‌టిసి బస్టాంగ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రారంభంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు 6 వేల ఉద్యోగాలకు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందని పేర్కొన్నారు. 2023, జూన్‌లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిందని పరీక్షకు నిరుద్యోగులు భారీగా 4లక్షల 49 వేల మంది రాసారన్నారు. తద్వారా అందులో 95 వేల మందిపైగా పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కోర్టు కేసులు, నిర్లక్ష్యం కారణంగా సుదీర్ఘంగా నాలుగు సంవత్సరాలు సాగించి చివరికి గత ఎన్నికలలో ఓటమిపాలు అయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసే బాధ్యత తమది అని హామీ ఇచ్చిందని, ఎన్నికలలో భారీగా గెలిచిందని అన్నారు. డివైఎఫ్ఐ అనేక పోరాట ఫలితంగా జనవరి, ఫిబ్రవరిలో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించి జూన్‌లో మెయిన్స్ పరీక్షలను నిర్వహించిందని పేర్కొన్నారు. 42,000 మంది హాజరు అయ్యారని అన్నారు. తద్వారా 6 వేల మంది పోస్టులకు మెయిన్స్‌లో అర్హత సాధించారని తెలిపారు. మెడికల్ పరీక్షలు నిర్వహించి పోస్టింగ్ ఇవ్వడంలో ప్రభుత్వం తస్కారం చేస్తుందని చెప్పారు. నాలుగు సంవత్సరాలుగా కానిస్టేబుల్ మెయిన్స్‌లో అర్హత సాధించి పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారు వేరే ఉద్యోగానికి వెళ్లలేక, ఉన్నది వదులుకోలేక సతమతం అవుతూ మానసిక వ్యధ చెందుతున్నారని పేర్కొన్నారు. కానీ ప్రభుత్వం కానిస్టేబుల్ ఉద్యోగాలు పోస్టింగ్ ఇస్తుందా లేదా అని క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. మంత్రి లోకేష్ మళ్లీ కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని చెబుతున్నారని పేర్కొన్నారు. ఏటా జాబ్ కేలెండర్ ఇస్తానని చెప్పారని, కానీ ఆ హామీ అమలు కాలేదని అన్నారు. ప్రభుత్వ శాఖలో పోస్టులు చాలా ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వాటిని భర్తీ చేయాలని అన్నారు. ఇప్పటికైనా కానిస్టేబుల్ మెయిన్స్‌లో అర్హత సాధించి ఎంపిక అయిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు సుబహాన్ పాల్గొన్నారు.

'సీమ'కు కేటాయించిన నీటిని అందించాలి

ప్రజాశక్తి - కడప

బచావత్ ట్రిబ్యునల్‌లో ట్రిబ్యునల్ రాయలసీమకు కేటాయించిన 512 టిఎంసిల నీటిని అందించాలని, ఒక్క టిఎంసి తగ్గినా మూల్యం చెల్లించక తప్పదని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమకు తాగేందుకు నీరు లేకుండా పోయే పరిస్థితి నెలకొందన్నారు.18 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు, యూరియా అందక తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. వందలాది మంది రైతులు నష్టాలతో ఆత్మహత్యలు చేసు కుంటున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అకాల వర్షాలకు లక్షలాది ఎకరాల్లో రైతులు నష్టపోయారు అన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చిన దాఖలాలు లేవని తెలిపారు. పత్తి, వరి, ఉల్లి, మిర్చి, టమోటా, మొక్కజొన్న, అన్ని రకాల పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, పాకా సురేష్, వినోద్ కుమార్, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

27 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల మూడో సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 27 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కె ఎస్ వి కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎ, ఎంకామ్, ఎంఎస్‌సి ఎంపిఎడ్. మూడో సెమిస్టర్ పరీక్షల టైం టేబుల్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27,29 డిసెంబర్ 1,3,5,8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

స్కూల్ గేమ్స్ ఎడ్యుకేషన్ అబ్జర్వర్‌గా గణేష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాలికల రాష్ట్రస్థాయి అండర్-19 పోటీలకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తరపున అబ్జర్వ్‌గా రామనపల్లి ఫిజికల్ డైరెక్టర్ పోలంకి గణేష్‌బాబును నియమించారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ - 19 బాయ్స్ అండ్ గర్ల్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ తరపున అబ్జర్వ్‌గా ఆయన నియామితులైన్నారు. పోలంకి గణేష్ బాబు ఈ నెల 23 నుంచి 25 వరకు కర్నూల్ ఆదర్శ పాఠశాలలో నిర్వహించే బాలబాలికల పోటీలో పాల్గొంటారు. డిసెంబర్ 24 నుంచి 29 వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి అండర్- 19 పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు, పోలంకి గణేష్ బాబును ఎంపిక చేశారు.

అర్జీల పట్ల బాధ్యతాయుతంగా స్పందించాలి

ప్రజాశక్తి - కడప

అర్జీదారులు, ఫిర్యాదుదారుల సమస్యలపై జిఆర్ఒ (గ్రీవిన్స్ రిడ్రెసల్ అథారిటీ) అధికారి బాధ్యతాయుతంగా, సానుకూల దృక్పథంలో స్పందించగలిగినపుడే ప్రజల సమస్యలను పెండింగ్ లేకుండా సమర్థవంతంగా పరిష్కరించగలమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీ, జిఆర్ఎ ప్రతిస్పందనలపై కలెక్టర్ జెసి అదితి సింగ్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, ఎస్‌డిసిలు వెంకటపతి, రంగస్వామిలతో కలిసి సిఎంఒ పిజిఆర్ఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సరళ, అన్ని డివిజన్ల రెవెన్యూ అధికారులుతో ఫిర్యాదుల పరిష్కారం, ఆడిట్ అంశాలకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొంతనలేని సమాధానాలు అర్జీదారులకు చెప్పరాదని, వారు అందించే ఫిర్యాదుకు సరైన, సూటి సమాధానం ఇవ్వాలన్నారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లోగా సంబందిత జిఆర్ఎ కచ్చితంగా ఎండార్స్‌మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. ఫిర్యాదుల ప్రయారిటీ, ఫ్లాగ్ నోట్ చేయడంలో, సంబంధిత డాక్యుమెంట్లు అప్ లోడ్ చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఈ విషయంలో తహశీల్దార్లు, శాఖాధిపతులు ఎల్లపుడు పైస్థాయి అధికారులు, పిజిఆర్ఎస్ సిబ్బంది, ఫిర్యాదుదారులు సమాచారం అందిపుచ్చుకునేలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేకుండా చేసుకోవాలన్నారు. కార్యాలయ వ్యవస్థను పదిలం చేయడంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పబ్లిక్ గ్రీవిన్సీ అడ్రసల్ సిస్టమ్‌లో భాగంగా ఆయా మండలాల ఫిర్యాదులను నమోదు చేస్తున్న పిజిఆర్ఎస్ సిబ్బందితో జిల్లా కలెక్టర్ మాట్లాడి ఫిర్యాదులపై స్పందన, పరిష్కార వేదిక ద్వారా తరచూ ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఎపి మోడల్ స్కూల్ హాస్టల్‌ను అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురంలోని ఎపి మోడల్ స్కూల్ లోని బాలికల వసతి గృహాన్ని శనివారం టిడిపి ఇన్‌ఛార్జి రితీష్‌రెడ్డి ఆదేశాల మేరకు బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, బాషతో కలిసి పరిశీలించారు. హాస్టల్ ప్రాంగణం మొత్తం తిరిగి వసతి గృహంలో ఉన్న పలు సమస్యలను గుర్తించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి వసతి గృహ అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తా మన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన పోరుమామిళ్ల సిఐ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన హేమ సుందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. సర్కిల్ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని రవీంద్రారెడ్డి కోరారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల హాస్టల్ వార్డెన్ టిడిపి నాయకులు పోలిరెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, మౌలాలి, విజయ్ కుమార్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, శివశంకర్ రెడ్డి, వార్డెన్, టిడిపి నాయకులు పోలి రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్తు వృత్తి అవకాశాలపై మార్గ నిర్దేశం అవసరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : భవిష్యత్తు వృత్తి అవకాశాలపై మార్గ నిర్దేశం అవసరమని సామాజిక వేత్త గుణశేఖర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం వైఎస్ఆర్ కడప జిల్లా స్టెప్ ఆధ్వర్యంలో 'వ్యక్తిత్వ వికాసం,వృత్తి మార్గదర్శకం' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం అనేది భవిష్యత్తులో విజయం సాధించేందుకు కీలకమని, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం, సమయపాలన, నాయకత్వ గుణాలు వంటి అంశాలు ప్రతి విద్యార్థి అభివృద్ధికి పునాదని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం కూడా తీరని అవసరమని చెప్పారు. ప్రతి విద్యార్థి తన బలాలు, బలహీనతలను గుర్తించుకొని వాటిని మెరుగుపర్చుకునే దిశగా నిరంతరం కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పాలెం గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌ను సరైన దిశలో నిర్మించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.

ఎపి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాంప్రసాద్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఎపి ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా యాదగిరి రాంప్రసాద్ నియమితులయ్యారు. రాష్ట్రంలోని కూటమి సర్కారు 11 కార్పొరేషన్ చైర్మన్ పదవులకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇందులో జిల్లాకు చెందిన ఇద్దరు టిడిపి నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించాయి. కడప పార్లమెంటు పరిధిలోని టిడిపి నాయకులు యాదగిరి రాంప్రసాద్‌కు పిఎ ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. ఈయనతో పాటు కడప పార్లమెంటు పరిధిలోని ప్రొద్దుటూరుకు చెందిన టిడిపి మైనార్టీ నాయకులు షేక్ ముక్తియార్‌కు షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది. దీంతో జిల్లాలోని టిడిపి కార్యకర్తల్లో హర్షం వ్యక్తం అవుతోంది

గండికోట పర్యాటక అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి కడప అర్బన్/కడప

పనుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

సాస్కి పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రానికి ప్రపంచ స్థాయిలో కీర్తిని ప్రతిబింబించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించి అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో గండికోట పర్యాటక అభివృద్ధి పనులపై కలెక్టర్, డిఆర్ఒ, జిల్లా పర్యాటకశాఖ, ఎపిటిడిసి అధికారులు, కాంట్రాక్టు ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గండికోట ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాల్లో క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం ప్రత్యేక సహకారం అందించే పథకం ద్వారా గండికోట పర్యాటక కేంద్రంలో సుసంపన్నమైన కోట, గార్జ్ అనుభవాన్ని పర్యాటకుల సొంతం చేసే దిశగా జిల్లా యంత్రాంగం పర్యాటక శాఖ ద్వారా అభివృద్ధి పనులకు నాంది పలికిందన్నారు. జనవరిలో గండికోట ఉత్సవాల నిర్వహణకు ముందే ఎంట్రన్స్, వెలివేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎపిటిడిసి ఇంజినీర్లు, ప్రాజెక్ట్ కన్సల్టెంట్‌లను ఆదేశించారు. ఈ సందర్భంగా గండికోట పర్యాటక కేంద్రం అభివృద్ధి పథకంలో భాగంగా చేపట్టే అన్ని రకాల పనులకు సంబంధించి మ్యాపులను, డిజైన్లను పరిశీలించి పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రాండ్ కాన్యన్‌ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ సదుపాయం కూడా కల్పించనున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి రానున్నాయన్నారు. సమీక్షలో జిల్లా టూరిజం అధికారి సురేష్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ఏడుకొండలు, ఎపిటిడిసి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం రాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెంచలయ్య, కన్సల్టెంట్లు సాజిత్ షేక్, సుమన్ దాస్, విజయ్ కుమార్ బండి, కాంట్రాక్ట్ ప్రతినిధి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

24న సంఘటన్ సుజన్ అభియాన్ కేంద్ర కమిటీ జిల్లాకు రాక

ప్రజాశక్తి - కడప

మీడియాతో మాట్లాడుతున్న విజయజ్యోతి

జిల్లాలో మంచి నాయకత్వం గల వారిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులను నియమించేందుకు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఈ నెల 24న సంఘటన్ సుజన్ అభియాన్ కేంద్ర కమిటీ జిల్లాకు రానున్నట్లు డిసిసి అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి తెలిపారు. ఈ కమిటీలో ఎఐసిసి నుండి ఒకరు, రాష్ట్రం నుంచి ముగ్గురు, జిల్లా నుంచి ఒకరు సభ్యులుగా ఉంటారని అన్నారు. శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయ జ్యోతి మాట్లాడారు. కమిటీ పది రోజులపాటు జిల్లాలో పర్యటిస్తుందని తెలిపారు. దేశంలో అన్ని జిల్లాల అధ్యక్షులను ప్రజల ద్వారానే ఎన్నుకునేందుకు కమిటీని నియమించారన్నారు. కమిటీ పర్యటనలో అందరి అభిప్రాయాలను సేకరించి మంచి నాయకత్వాన్ని ఎన్నుకుంటారన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలనుకుంటున్న వారు కమిటీ ముందుకు వచ్చి తమ అభిప్రాయాలను చెప్పుకోవచ్చునని అన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, అట్లూరు మండల అధ్యక్షులు శీలం గంగయ్య, నాయకులు జాబిర్ అలీ పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై చర్చకు సిద్ధమా

- మాజీ డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప : నగర అభివృద్ధిపై పదేళ్లలో తాము ఏం చేశామో శ్వేత పత్రం విడుదల చేస్తాం, టిడిపి 18 నెలల్లో ఏం చేశారో చర్చించేందుకు సిద్ధమా? అని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా కడప ఎమ్మెల్యే మాధవికి సవాల్ విసిరారు. శనివారం సాయంత్రం తన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల ముందు టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆక్రోశం, ఆవేశంతో ఎమ్మెల్యే, శ్రీనివాసులరెడ్డి మాట్లాడటం తీరు ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. టిడిపి అధినేత మాటల్లో ఏ ఒక్కటి నిజం ఉండదని ఆరోపించాచు. వైసిపి హయంలో వందల కోట్ల నేతలు నిధులు తెచ్చి అభివృద్ధి చేసామని చెప్పారు. 7 ప్రధాన రోడ్లను వెడల్పు చేసి, కూడళ్లను అభివృద్ధి చేశామని చెప్పారు. జిల్లా కేంద్రంలో కేన్సర్, ఇతర 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెచ్చాం అని తెలిపారు. దావత్ అర్థం తెలియకుండా టిడిపి ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని ఆరోపించారు.

సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని వెస్ట్ జోన్ మరియాపురం చర్చి వద్ద 18వ సిఐటియు జాతీయ మహాసభల పోస్టర్లను ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్, నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరామ్, సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభలు డిసెంబర్ 31 నుంచి 2026, జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఉంటాయని తెలిపారు. మహాసభల కోసం 'మున్సిపల్ కార్మికులమైన మేము మీ వద్దకి వస్తున్నాం.. మీ ఇంటికి వస్తున్నాం.. జోల పట్టి అడుగుతున్నాం ఆర్థిక సాయం చేయగలరు' అని కోరారు. తాము ఆర్థిక సాయం కోసం ఎందుకు అడుగుతున్నామంటే కేవలం మున్సిపల్ కార్మికుల సమస్యలు కాకుండా, బ్యాంకు, డాక్టర్స్, నర్స్, ఎల్ఐసి, రైల్వే, వివిధ ప్రయివేట్ కంపెనీలలో గవర్నమెంట్ సెక్టార్‌లో పనిచేస్తున్న ప్రతి కార్మిడి కోసం సిఐటియు ఎర్రజెండా ఎనలేని పోరాటాలు చేస్తూ ఉందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాల రాస్తూ ఉన్నాయని తెలిపారు. కార్మిక, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాడుతుంది సిఐటియు మాత్రమేనని చెప్పారు. మహాసభలకు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రంలో జరుగుతున్న మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. నగర ప్రజలందరూ అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఆర్థిక సహకారం అందించి విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విధులపై అవగాహన తప్పనిసరి : జడ్జి

ప్రజాశక్తి - కడప

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చట్టపరమైన సలహాలు, జైలు సందర్శనలు, కేసుల వివరాలు, పరిష్కారం తదితర అంశాలను చర్చించి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లు ఎమ్.శాంత, ఎం.వినయ్ కుమార్, ఎం.చంద్రకాంతమ్మ, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెలర్లు పి.మనోహర్, ఎం సౌజన్య, ఎన్. నీలకంఠేశ్వర రెడ్డి, షేక్ అక్బర్ అలీ, ఎస్.రవితేజ, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అవాంఛనీయం!

ప్రజాదృష్టి

ఆన్‌లైన్ బెట్టింగ్, డిజిటల్ మోసాలు పెరిగిపోయాయి. కడప, అన్నమయ్య జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు, వేంపల్లి, మదనపల్లి కేంద్రాలుగా క్రికెట్ బెట్టింగులు మొదలుకుని డిజిటల్ మోసాలు, కిడ్నీ రాకెట్లు వంటి అవాంఛనీయ ధోరణులు పెచ్చరిల్లాయి. అత్యాశ, దురాశల బారిన పడిన యువత, వైద్యులు విలువైన జీవితాల్ని మసకబార్చుకుంటుండడం శోచనీయం. అవాంఛనీయ ధోరణుల్ని నివారించడం పోలీసులకు సవాల్‌గా మారింది. బెంగళూరు కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల్ని ప్రొద్దుటూరు డిఎస్‌పి భావన బృందం వలపన్ని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వేంపల్లి మండలానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నుంచి ఢిల్లీకి చెందిన కొంతమంది అపరిచిత వ్యక్తులు రూ.లక్షలాది డిజిటల్ చోరీకి పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఉన్నత విద్యావంతులైన యువత పెడధోరణుల బారినపడి సమస్యలమయం చేసుకుంటున్న సంగతిని గ్రహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అవకాశాల్ని అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించే ప్రయత్నం చేయాలి. కుటుంబాలకు, సమాజానికి మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉంది. అతిస్వల్ప వ్యవధిలో డబ్బులు సంపాదించాలనే దురాశతో ఆపదల పాలవడం సరికాదనే సంగతిని గ్రహించాలి. ఆశ పడాలి కానీ అత్యాశ పడకూడదు. దురాశ అసలే తగనిపని అని గ్రహించాలి. ఈ నెల 19న కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటన సఫలీకృతమైంది. అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ కార్యక్రమాన్ని జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిరాశ పరుస్తోంది. చట్టబద్ధమైన భూముల ఆన్‌లైన్, ఇకెవైసి చేయడంలో అంతులేని నిర్లక్ష్యం చేస్తోంది. చట్టబద్ధత లేని భూములను ఆన్‌లైన్ చేయడం వంటి వ్యతిరిక్త ధోరణుల్ని కలిగి ఉందని చెప్పాలి. ఇటువంటి ధోరణుల్ని సరిచేయడానికి జిల్లా అధికార యంత్రాంగం సైతం నిర్లిప్తతకు దిక్సూచీగా మారిందని చెప్పవచ్చు. ఈ ఏడాది మేలో నిర్వహించిన టిడిపి మహానాడు బహిరంగ సభ వేదికపై నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.వెయ్యి కోట్లతో జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు చేపడతామన్న హామీ ఆమలుకు నోచుకోలేదు. తాజాగా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండల పర్యటనలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పిఎ కిసాన్ కార్యక్రమ వేదిక నుంచి ఈ ఏడాదిలోనే సర్వరాయసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలిస్తే సర్వరాయసాగర్ రిజర్వాయర్ కట్ట పనుల పెండింగ్‌ను అలా ఉంచితే, పంట కాల్వల పనులకు సంబంధించి రూ.36 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. పంట కాల్వలకు నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారో తెలియదు. ఎమ్మెల్యే సిఎం ఇచ్చిన హామీ ప్రకారం పంటల కాల్వల నిధుల కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని ఘంటాపథంగా చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పార్టీ పటిష్టతకు కృషి : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు: స్థానిక, 2029 సాధారణ ఎన్నికల్లో వైసిపి జెండాను జమ్మలమడుగులో ఎగరేస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తనకు ఒక గట్టి హామీ ఇచ్చారని, ఆమేరకు అందరితో కలిసి పనిచేస్తానని తెలిపారు. జగన్ పిలుపుతో తాను ఫ్యాక్షన్ నియోజకవర్గంలో వచ్చానని తెలిపారు. తాను, ఎంపీ అవినాష్‌రెడ్డి పార్టీ కోసం నియోజకవర్గంలో చాలా కష్టపడ్డామన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికలలో ఎన్నడూ లేని విధంగానియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా 53 వేల ఓట్ల మెజార్టీతో వైసిపి జెండాను ఎగరవేశామన్నారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గానికి ఎంతో మందికి చైర్మెన్, డైరెక్టర్ పదవులు వచ్చాయని చెప్పారు. వైసిపిని వీడే ప్రసక్తే లేదని వై.ఎస్. జగన్‌కు చెప్పానని, ఇప్పుడు ఎవరికి టికెట్ ఇచ్చినా వైసిపి జెండా ఎగరటానికి కృషి చేస్తానన్నారు. .అందరిని కలుపుకుని పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. సమావేశంలో జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు వల్లంభాయి హృషి కేశవ రెడ్డి, దొడియం విష్ణువర్ధన్‌రెడ్డి, మోహన్ రెడ్డి, బొమ్మేపల్లి ప్రతాప్‌రెడ్డి, కల్లూయిస్వామి, బడిగించాల చంద్రమౌళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి పులివెందుల టౌన్ అంగన్వాడీ టీచర్లు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలను ఆధ్వాన్నంగా నిర్వహిస్తున్నారని, నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్‌పి ఓబులమ్మ కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల రెవెన్యూ డివిజన్ల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, డిఎస్‌పి కరీం, అన్ని మండలాల తహశీల్దార్లు, బోర్డు మీటింగ్ హాలులో పిఆర్‌ఎస్ కంట్రోల్ రూం ఇన్‌ఛార్జి సురేష్ కుమార్, శిరీష, ఎఫ్ సెక్షన్ సూపరింటెండెంట్ మాధవరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యం : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులపై మైదుకూరు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల భద్రత, రక్షణను అత్యంత ప్రాధాన్యంగా పరిగణిస్తూ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు మైదుకూరు డిఎస్‌పి జి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ తనిఖీలలో పోలీసులు బస్సుల ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు, ఇన్సూరెన్స్ పత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు పరిశీలించారు. బస్సుల్లో ఉండే ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, సీటింగ్ సామర్థ్యం వంటి అంశాలనుపరిశీలించారు. అనంతరం డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమన్నారు. డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సిఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

కేబుల్ చోరీ కేసుల్లో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి పులివెందుల రూరల్ : పులివెందుల రూరల్ సర్కిల్ పరిధిలోని రైతుల పొలాల్లో కేబుల్ వైర్‌ను కత్తిరించడం షెడ్డు పగలకొట్టి కేబుల్ వైర్‌ను, ట్రాన్స్‌ఫార్మరును పగులగొట్టి కాపర్ వైర్‌ను దొంగిలించిన కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. శనివారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన జాఫర్ షరీఫ్, హారూన్ రషీద్ సురేంద్ర కేబుల్ చోరీలకు పాల్పడుతున్నట్లు వారిని చెప్పారు. వీరిలో ఇద్దరిని శనివారం మధ్యాహ్నం లింగాల మండలం అంబకపల్లెలో లింగాల ఎస్ఐ అనిల్‌కుమార్ అరెస్టు చేశారని చెప్పారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదు, ట్రాన్స్‌ఫార్మర్, కాపర్‌వైర్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో పులివెందుల రూరల్ సిఐ వెంకటరమణ, లింగాల ఎస్ఐ అనిల్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

కాంట్రాక్టు కోసం ఘర్షణ.. ఒకరికి కత్తిపోటు

ప్రజాశక్తి - ముద్దనూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అందించే స్మార్ట్ కిచెన్ భవనం ఏర్పాటు చేసే విషయంలో శనివారం బిజెపి, టిడిపి గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాలుర ఉన్నత పాఠశాలకు ప్రభుత్వం స్మార్ట్ కిచెన్ భవనం మంజూరు చేసింది. బిజెపికి చెందిన కాంట్రాక్టర్ కొన్ని రోజుల కిందట స్మార్ట్ కిచెన్ భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. శనివారం టిడిపికి చెందిన కాంట్రాక్టర్ సంబంధిత శాఖకు చెందిన అధికారులతో కొలతలు వేయించుకుని భూమి పూజ చేశారు. అప్పటికే ఇరు గ్రూపులకు చెందిన కాంట్రాక్టర్లు పాఠశాల వద్దకు చేరుకుని కాంట్రాక్టు తమదంటే తమదని అంటూ గొడవ పడ్డారు. ఇందులో ఎస్‌వి గిరి కాలనీకి చెందిన బిజెపి గ్రూపు వ్యక్తి వినోద్ కత్తి పోటుకు గురయ్యారు. గాయపడ్డ వ్యక్తిని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు : మండలంలోని కొర్రపాడుకు చెందిన శ్రీనివాస్ రెడ్డి (50) శనివారం విద్యుదాఘాతంలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. శ్రీనివాసరెడ్డి ఉదయం ఇన్వర్టర్‌ను మరమ్మతు చేస్తుండగా విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ కుమార్, చెన్నారెడ్డి సందర్శించి నివాళులర్పించారు .మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతు సేవా కేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు : జెడి

చక్రాయపేట : వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జెడి చంద్రానాయక్

ప్రజాశక్తి-చక్రాయపేట

రైతులు రైతు సేవా కేంద్రం ద్వారానే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ పేర్కొన్నారు. శనివారం చక్రాయపేటలో ఏర్పాటు చేస్తున్న రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 250మంది రైతులు 1350 ఎకరాలలో వరి పంటను సాగు చేశారని చెప్పారు. ముఖ్యంగా అద్దాల మర్రి, కుమార్‌కాల్వ , ఎర్ర బొమ్మనపల్లె, కె. రాజుపల్లె గ్రామాలలో వరి పంటను సాగు చేస్తున్నారని, కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుల నుంచి వరి ధాన్యం సేకరణకు చక్రాయపేటలో రైతు సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. వరి పండించే రైతుల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయుటకు తగిన ఏర్పాట్లను చేశామని తెలిపారు. ఇందులో భాగంగా వరి ధాన్యం గ్రేడ్ ఏ రకం క్వింటాల్‌కు రూ. 2,389, సాధారణ రకం క్వింటాల్ రూ. 2,369 గాను ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. తేమ శాతం 17 శాతానికి మించరాదని, చెత్త,రాళ్ళు, తాలు ఒక శాతానికి . చెడిపోయిన ,రంగు మారిన విత్తనాలు ఐదు శాతానికి, పరిపక్వానికి రాని, వంకర తిరిగిన గింజలు మూడు శాతానికి మించకూడదని ఆయన రైతులను ఉద్దేశించి తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, స్థానిక మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి వ్యవసాయ విస్తరణ అధికారి రమణారెడ్డి, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్** మండలంలోని కణంపల్లి, చిన్న రంగాపురం, పెద్ద రంగాపురం తదితర గ్రామాలలో వేరుశనగ పంట వేసిన రైతులకు స్థానిక ఎంపిడిఒ సభ భవనంలో పులివెందుల ఫార్మర్స్ ప్రొడ్యూసింగ్ (ఎఫ్‌పిఒ)ఆర్గనైజేషన్ సంస్థ ద్వారా వేరుశనగ చిరు సంచులను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు ఉచితంగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడి చంద్ర నాయక్ మాట్లాడుతూ నూనె గింజల ఉత్పత్తి పెంచడమే జాతీయ నూనె గింజల పథకం ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. ఆ దిశగా రైతులందరినీ ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం ద్వారా వేరుశనగ పండించేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుత రబీ సీజన్‌కు సంబంధించి పులివెందుల సబ్ డివిజన్ వ్యాప్తంగా వేరుశనగ పంటవేసే రైతులను గుర్తించి తద్వారా ఆయా గ్రామాల రైతులకు ఆధునిక, సస్యరక్షణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి కమ్యూనిటీ సస్టైనబుల్ అగ్రికల్చర్ ఎన్‌జిఒ ఆదినారాయణ, జనార్ధన్, ఎఫ్‌పిఒ అంకిరెడ్డి, మండల వ్యవసాధికారులు చెన్నారెడ్డి, రమేష్ రైతులు, రైతు సేవ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు చంద్రా నాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఇడుపులపాయి-2 లో ఏర్పాటు చేసిన వరి ధ్యానం కేంద్రాన్ని వ్యవసాయ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లె మండలంలో 3 గ్రామాల్లో దాదాపు 700 మంది రైతులు 1000 ఎకరాలలో వరి పంటను సాగు చేసినట్లు చెప్పారు. కుమ్మరాంపల్లె, ఇడుపులపాయి, అలిరెడ్డిపల్లె గ్రామాల్లో ఎక్కువగా వరి పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వరి పంట పండించే రైతులు కోసం వరి ధాన్యం సేకరణకు ఇడుపులపాయి-2 రైతు సేవా కేంద్రాలను కొనుగోలు కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శివ శంకర రెడ్డి, తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సురేఖ, శివ, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు. **చాపాడు (మైదుకూరు) :** వరి రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి, తహశీల్దార్ రాజసింహ నరేంద్ర తెలిపారు. శనివారం మైదుకూరు మండలంలోని శివపురం వరి ధాన్యం కొను గోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదుకూరు మండలంలో నాలుగు గ్రామాలలో సుమారు 1000 మంది రైతులు 3వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశారన్నారు. ముఖ్యంగా శివపురం, అన్నలూరు, గంజి కుంట గ్రామాలలో వరి పంటను సాగు చేశాన్నారు. వరి పండించిన రైతుల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయడానికి తగిన ఏర్పాట్లను చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది సౌజన్య, మధు పాల్గొన్నారు. **చాపాడు :** ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడుతుందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. మండల వ్యవసాయ అధికారి దేవి పద్మలతతో కలిసి శనివారం చాపాడులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో చాపాడుతో పాటు అన్నవరం గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు అందు బాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ సిబ్బంది అంకయ్య, రంగన్న రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలను పరిష్కరించే వేదికలే లోక్ అదాలత్‌లు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

లోక్ అదాలత్‌లు వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించే ప్రత్యామ్నాయ న్యాయ వేదికలు అని, వీటి ద్వారా ఆర్థిక స్థోమత లేని ప్రతి పేద వాడికి ఉచితంగా స్వల్ప వ్యవధిలో కచ్చితమైన న్యాయం అందుతుందని, లోక్ అదాలత్ లకు పోలీసులు సహకరించాలని పులివెందుల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎమ్.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పులివెందుల కోర్టులో పులివెందుల డివిజన్ పోలీస్ అధికారులతో కలిసి మండల లీగల్ సర్వీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి మాట్లాడుతూ డిసెంబర్ 13న నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తామని, తద్వారా సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్ తగాదా, రాజీ పడదగిన అన్ని కేసులు పరిష్కరిస్తారని చెప్పారు. అత్యధిక కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చూడాలన్నారు. ఒకసారి లోక్ అదాలత్ ద్వారా కేసు పరిష్కారమైతే సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని లోక్ అదాలత్‌లు పెండింగ్ కేసులను పరిష్కరించడంపై దృష్టి సారించాయని తెలిపారు. సమావేశంలో సమావేశానికి అర్బన్ సిఐ వి. సీతారామిరెడ్డి. రూరల్ సిఐ ఎస్.వి రమణ, వేంపల్లి సిఐ జె.నరసింహులు, ట్రాఫిక్ సిఐ హాజీవల్లీ, ఎస్‌ఐలు రంగారావు, ప్రవీణ్ కుమార్, గణ మద్దిలేటి, ఎక్సైజ్ ట్రాఫిక్ పోలీస్, కోర్టు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : జడ్జి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఖైదీలు సత్ప్రవర్తనతో మెరగాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం స్థానిక సబ్ జైల్‌ను జడ్జి భార్గవి పరిశీలించారు. ఈ సందర్భంగా ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. వంటగది, ఖైదీలు ఉండే గదులను పరిశీ లించారు. అనంతరం ఆమె సబ్ జైలులో వసతులు బాగున్నాయా లేవా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. చలికాలం కావడం వల్ల ఖైదీలకు దుప్పట్లు మంచివి ఇవ్వాలని జైలర్‌కు సూచించారు. వచ్చే నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ జైలర్ హర్షవర్ధన్ రెడ్డి, ఖైదీలు, సబ్ జైలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్‌టియు రాష్ట్ర నాయకులు గురుకుమార్ తెలిపారు. శనివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డికి ఎస్‌టియు నాయకులు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిఇడి, బిఇడి ఎంట్రెన్స్ ద్వారా సీటు పొంది తర్వాత డిఎస్‌సి సెలక్షన్ లిస్ట్ ద్వారా ఉపాధ్యాయులుగా వచ్చిన వారికి మళ్లీ టెట్ పరీక్ష నిర్వహించడం సరికాదన్నారు. ఇతర సబ్జెక్టులలోనూ అర్హత మార్కులు పొందాలనడం విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడవడమేనని తెలిపారు. అందుకు భూపేష్ రెడ్డి స్పందిస్తూ ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుళ్లి ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపునకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో గురుకుమార్, భాస్కర్, గౌస్, శివరాం, శివరామిరెడ్డి, రాజశేఖర్, ఓబులేసు, కుమారస్వామి, దామోదర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ధైర్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు వాటిని జయించేందుకు మానసిక ధైర్యం పెంచుకోవాలని, అప్పు ఆత్మహత్యలు నివారించేందుకు అవకాశం ఉంటుందని సిఐ నర్సింహులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అక్షర మహిళా జూనియర్ కళాశాలలో శక్తి యాప్, బాల్య వివాహాలు, ఆత్మహత్యలు, సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితాలు నాశనం చేసుకోకుండా ఉండాలంటే చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలని కోరారు. విద్యార్థుల్లో ఒత్తిడి పెరిగినప్పుడు కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులకు, అధ్యాప కులకు సమాచారం అందిస్తే సమస్య పరిష్కారం కావడంతోపాటు ఉపసమనం కలుగుతుందని చెప్పారు. చిన్న విషయాలకే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకూడదని చెప్పారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. చదువుపైనే ఎక్కువగా దృష్టి పెట్టాలని కోరారు. చదువును మధ్యలో ఆపి వేయకుండా ఉన్నత చదువులు చదవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయభారతి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - తొండూరు

ప్రభుత్వం అందించిన దుప్పట్లను శనివారం స్థానిక బిసి బాలుర వసతిగృహంలోని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి ఉమర్ ఫరూక్, ట్యూటర్లు మునేశ్వరి, లక్ష్మీనరసమ్మతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ మదార్ షావలి గంధం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బిడ్డాల మిట్టలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉరుసు మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి వేంపల్లెలోని గరుగు వీధిలో ఉన్న పీరా సాహెబ్ ఇంటి నుంచి పక్కీర్ల మేళా తాళాలతోగ్రంథం తీసుకొని దర్గాకు చేరుకున్నారు. అనంతరం దర్గా వద్ద చదివింపులు చేసి జిందేషా మదార్ షావలి సమాధికి గంధం పూశారు. దర్గా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన సిఐ నరసింహులకు దర్గా కమిటీ ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. శనివారం పంచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి ఇంటి నుండి జిందేషా మదార్ షావలి జెండాను మెరవణిగా తీసుకొని దర్గాకు చేరుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన వారందరికి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పీరా సాహెబ్, ఫయాజ్ బాష, తెలంగాణ వలి, పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి, మదార్, చాంద్ బాషాతో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ప్రకృతి వ్యవసాయ ఎడబ్ల్యుడి పద్ధతి వరి సాగుతో అధిక దిగుబడి సాధించవచ్చని ఎం.టి శ్యామ్ సుందర్ తెలిపారు. శనివారం ఎపి సిఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు మండలం పెద్దదండ్లూరు యూనిట్ సిరిగేపల్లె గ్రామంలో గురుమూర్తి వరి పంట పొలంలో పంట కోత ప్రయోగం చేశారు. ఈ సందర్భంగా ఎం.టి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ ఆరుతడి పంటలను సాగు చేసి పంటకోత ప్రయోగం చేశామన్నారు. ఇందులో 19 కేజీల 520 గ్రాములు ధాన్యం వచ్చిందన్నారు. దీని ప్రకారం ఒక ఎకరానికి 42.16 బస్తాలు వస్తాయన్నారు. ఈ లెక్క ప్రకారం గురుమూర్తి ఒక ఎకరాకు రూ.63,180 ఆదాయం రాగా, ఖర్చు రూ.18500, నికర ఆదాయం రూ.44680 వస్తుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం వల్ల తనకు ఖర్చు తగ్గిందని గురుమూర్తి తెలిపారు. వరి నాటిన తర్వాత 15 రోజులకు ఒకసారి ద్రవ జీవామృతం పారించడం, పంటకు గాలి, వెలుతురు తగిలేందుకు కాలిబాటలు తీయడం, దోమకు పసుపు తెలుపు పళ్లాలు పెట్టడం, లింగాకర్షక బుట్టలు పెట్టడం, పక్షి స్థావరాలు పెట్టడం వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. గట్ల మీద టమోటా, మిరప, బంతి, గోంగూర పెట్టుకోవడం వల్ల అదనంగా ఆదాయం వస్తుందన్నారు. పంటకోత ప్రయోగంలో యూనిట్ ఇన్‌ఛార్జి బాలనారాయణ, ఐసిఆర్‌పిలు విజయమ్మ, గౌతమి, నాగేశ్వరి, రైతు గురుమూర్తి పాల్గొన్నారు.

చర్చి తిరుణాల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - కలసపాడు

స్థానిక ఎస్‌పిజి, పరిశుధ పేతురు, పరిశుధపౌలు చర్చి 138 వార్షికోత్సవం ఏర్పాట్లను శనివారం సాయంత్రం పోరుమామిళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ హేమ సుందర్‌రావు పరిశీలించారు. వాహనాల పార్కింగ్ జన సేకరణ తదితర ఏర్పాట్లపై డీనరీ చైర్మన్ రెవరెండ్ మద్దెల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో చర్చి ప్రాంగణంలో పరిశీలించారు. పరిశుభ్రతలో భాగంగా చురుగ్గా పనులు చేస్తున్నారు లేదా అని పరిశీలించారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఎస్ఐ కొండారెడ్డి కాశినాయన ఎస్ఐ యోగేంద్ర, కమిటీ సభ్యులు పల్లవోలు కమలాకర్, పబ్బతి ప్రసన్న, కారు ప్రవీణ్ పాల్గొన్నారు.

సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సచివాలయంలో సిబ్బంది నిల్

ఇన్‌ఛార్జులతో అవస్థలు - ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి -కాశినాయన

మండల కేంద్రమైన నర్సాపురం సంబంధించిన సచివాలయంలో సిబ్బంది సమయ పాలనం పాటించడం లేదు. ఆయా పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, సచివాలయ సర్వేర్ తప్ప అసలు సిబ్బందే లేరు. పంచాయతీ సెక్రెటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అంతా ఇన్‌ఛార్జీలే వ్యవహరిస్తున్నారు. సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. చాలా మంది ఇన్‌ఛార్జులు ఉండడంతో వారి సొంత సచివాలయాల్లో ఉద్యోగాలు చేస్తూ సమయం దొరికి నప్పుడు మాత్రమే ఇక్కడికి వస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని అతి పెద్ద పంచాయతీ నరసాపురం. గ్రామానికి సంబంధించి సచివాలయానికి రోజూ వందల సంఖ్యలో ప్రజలు తమ అవసరాల కోసం వస్తుంటారు. ఆ సమయంలో సిబ్బంది లేకపోవడంతో వారు ఎలాంటి అవస్థలు పడుతున్నారో జిల్లా అధికారులు అర్థం చేసుకోవాలి. కార్యాలయం ఎప్పుడు చూసినా ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుంటాయి. ప్రజలు ఎన్నో వ్యవప్రయాసాలకోర్చి సచివాలయానికి వచ్చి గంటల కొద్ది వేచి ఉండి నిరాశతో వెనుదిరిగి పోతున్నారు. ఈ సమస్యపై ఎవరిని అడగాల్లో అర్థం కాక తలల పట్టుకుంటున్నారు.

శశిభూషణ్‌రెడ్డి బిసిలకు క్షమాపణ చెప్పాలి : వైసిపి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

శశిభూషణ్ రెడ్డి బిసిలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే బిసిలందరూ ఏకమై ఆయన ఇంటి ముందు ధర్నా చేస్తారని వైసిపి బిసి నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి సీని యర్ రాష్ట్ర నాయకులుగా ఉన్న శశిభూషణ్‌రెడ్డి పులివెందుల ప్రాంతం కోసం ఏమి చేశారో సమాధానం చెప్పాలన్నారు. కడప ఎంపీ వై.ఎస్ అవినాష్‌రెడ్డి గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని పేర్కొన్నారు. అవినాష్‌రెడ్డి వ్యక్తితం గురించి మాట్లాడే అర్హత మీకు లేదని తెలిపారు. పులివెందుల ప్రజలకు ఉపయోగపడే మెడికల్ కళాశలాను ప్రయివేటీకరణ చేస్తుంటే నోరు మెదపకపోవడం సరైంది కాదన్నారు. పులివెందులలో అవినీతి జరిగిందని విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. సమావేశంలో వైసిపి బిసి నాయకులు కోడి రమణ, కనక గంగాధర్, కో - ఆప్షన్ చంద్రమౌళి, చెన్నూరు కార్తీక్, నవీన్ పాల్గొన్నారు.

రైతుల పరిస్థితి దయనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేముల : చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వేముల మండలం బెస్తవారిపల్లె వద్ద అరటి తోటను కాంగ్రెస్ నేతలతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం టన్ను అరటి రూ.15 వేల చొప్పున వ్యాపారులు కొన్నారని, రైతుకు గిట్టుబాటు అయిందని అన్నారు. ఈ సంవత్సరం వ్యాపారులు కొనడం లేదని, కనీసం అడిగే వారే కరువయ్యారనిపేర్కొన్నారు. పండిన పంటను ఏం చేయాలో అర్థంకాక రైతులు లబోదిబో అంటున్నారని వాపోయారు. అన్ని పంటల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. చీనీ, ఉల్లి, పసుపు, మిర్చి, పొగాకు, పూలు ఇలా అన్ని పంటల పరిస్థితి ఇలాగే ఉందన్నారు. ప్రభుత్వం ఇటువంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకొని రైతుల వద్ద నుండి కనీస మద్దతుకు రైతు పండించిన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, కానీ చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తి నట్లు ఉలుకుపలుకు లేకుండా ఉందని ఆరోపించారు. ప్రభుత్వ వెంటనే జోక్యం చేసుకొని టన్ను అరటి రూ. 15 వేల చొప్పున కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - గోపవరం :

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ సురేష్‌బాబు పేర్కొన్నారు. శనిఆవరం స్వచ్ఛత ఛాంపియన్ లో భాగంగా మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు, సిబ్బంది పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఎలాంటి వ్యా ధులు దరి చేరవని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యాక్రమాలకు ప్రజల సంఘీభావం అవసరమన్నారు. ప్రజలందరూ పరిశుభ్రతను అలవాటు చేసు కుంటే గ్రామాలు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని కల్గి ఉంటాయన్నారు. కార్యక్ర మంలో గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **ముద్దనూరు:** ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు ప్రాధాన్యతనిచ్చి వ్యక్తిగత ,పరిసరాల పరిశుభ్రత పాటించాలని సామాజిక కార్యకర్త డోన్ మహ్మద్ రఫీ తెలిపారు. సివి వెంకట రామన్ మాసోత్సవం సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. వేంపల్లెలోని గాంధీ రోడ్డులో నివాసం ఉన్న టిడిపి సీనియర్ మైనార్టీ నాయకుడు పూల బక్షు ఇటీవల మోకాలకు అపరేషన్ చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం పూల బక్షును ఇంటికి షబ్బీర్ వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు.వైద్యుల సలహాలు తీసుకొని త్వరగా కొలుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో టిడిపి నేతలు మహబూబ్ షరీఫ్, శ్రీను, భాస్కర్ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **CHENNAMSETTY KALYANI**, W/o CHENNAMSETTY HARI KRISHNA, R/at D.No.32/92, Gangamma Gadda Veedhi, Devuni Kadapa, YSR Kadapa Dist, AP-516001, declare that my daughter's name was incorrectly mentioned as **CHENNAMSETTY SHALIKA SRI** in Passport No. N0226962. Her correct name is **CHENNAMSETTY SHALIKA SREE** (New Name) for all purposes.

CHANGE OF NAME

I, **CHENNAMSETTY YESWANTH,** S/o CHENNAMSETTY HARI KRISHNA, R/o D.No. 32/92, Gangamma Gadda Veedhi, Devuni Kadapa, YSR Kadapa Dist, AP– 516001, declare that my name has been wrongly mentioned as **CHENNAMSETTY YASWANTH** in Passport No. N0817620.My correct name is **CHENNAMSETTY YESWANTH** (New Name) for all purposes.

IN THE COURT OF THE I ADDL JUNIOR CIVIL JUDGE TIRUPATI
I.A.No. 294/2020
O.S.No. 322/2020
A.Bhaskar Naidu ...**Petitioner / Plaintiff**
Vs
K.Prakash Reddy & others
...Respondents / Defendants
Notice to the Respondents / defendants No. 9 & 10
R.No.9 P.Chinnappa Reddy, S/o. Konda Reddy, D.No. 9-26, Malineni Patnam (V), Peddapalli Panchayathi, Siddavatam Mandal, Kadapa Dist.
R.No.10 Renati Venkata Siva Reddy, S/o. Narasimha Reddy, D.No. 41/316-1, Sankarapuram, Chinnachowk, Kadapa (M), Kadapa Dist
Sir
Please take notice that the above case stands posted to 1-12-2025 for your appearance. Do appear and file your Objection at 10:30am in the above mentioned court. Else the matter will be devided exparte.
Place: Tirupati.
Date of hearing : 1/12/2025
N. VENKATA RAMANA REDDY
Advocate for Petitioner / Plaintiff, Tirupati

IN THE COURT OF THE I ADDL JUNIOR CIVIL JUDGE TIRUPATI
O.S.No. 322/2020
A.Bhaskar Naidu **...Plaintiff**
Vs
K.Prakash Reddy & others **...Defendants**
Suit summons to the defendants No. 9 & 10
D.No.9 P.Chinnappa Reddy, S/o. Konda Reddy, D.No. 9-26, Malineni Patnam (V), Peddapalli Panchayathi, Siddavatam Mandal, Kadapa Dist.
D.No.10 Renati Venkata Siva Reddy, S/o. Narasimha Reddy, D.No. 41/316-1, Sankarapuram, Chinnachowk, Kadapa (M), Kadapa Dist
Sir
Please take notice that the above case stands posted to 1-12-2025 for your appearance. Do appear and file your Objection at 10:30am in the above mentioned court. Else the matter will be devided exparte.
Place: Tirupati.
Date of hearing : 1/12/2025
N. VENKATA RAMANA REDDY
Advocate for Plaintiff, Tirupati

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు : కడప
I.P. No : 20/2025
చింతకుంట ఉదయ భాస్కర్ రెడ్డి, తండ్రి సుబ్బరాయుడు, హిందూ, వయసు సుమారు 65 సం.లు, డోర్ నెం.9 / 71, రెడ్డి వారు వీధి, చెన్నూర్, కడప. **...పిటీషనరు**
మరియు
R5. పెడబల్లి వినయ్ కుమార్ రెడ్డి, తండ్రి ప.శివారెడ్డి, హిందూ, వయసు సుమారు 29 సం.లు, డోర్ నెం. 12/274, అప్ స్టైర్స్, పొట్టి శ్రీరాములు వీధి, కడప సిటీ.
R6. పెడబల్లి భాను ప్రియ, భర్త వినయ్ కుమార్ రెడ్డి, వయసు సుమారు 24 సం. లు, డోర్ నెం. 12/274, అప్ స్టైర్స్, పొట్టి శ్రీరాములు వీధి, కడప సిటీ.
నోటీసు
రెస్పాండేంట్ నెం.5 & 6 పైన తెలిపిన పిటీషనరును ఇంసాల్వేన్సిగా డిక్లేర్ పరచమని కోరుచూ పిటిషను దాఖలు చేసినందున ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టులో 10.12.2025 వ తేదిన ఉదయం 10.30 ని. లకు ఖుద్దున గానీ, వకీలు వారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనవలెను, లేని ఎడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.
//కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు//
సం. ఎం.నాగిరెడ్డి,
పిటిషనర్ తరుపు న్యాయవాది

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
O.S.No. 276/2023
Chamala Bala Narayana Reddy, S/o Rami Reddy, aged 68 years,Hindu, cultivation, D.No.213, Muchumarri village, Kondapuram mandal, Kadapa dist. **...వాది**
Vs
Godina Govindu, S/o Hanumanthu, Hindu, aged about 61, retired railway employee, Kondapuram village and mandal, Kadapa dist. **...ప్రతివాది**
దావా సమను
పైన పేర్కొన్న వాది, ప్రతివాది అయిన మీరు ఇవ్వవలసిన ప్రోనోటు బాపతు బాకీ సంబంధించి డిక్రీ కోరుతూ మీ పైన దాఖలు చేసిన దావా మీ హాజరు కొరకు పైకోర్టులో 24.11. 2025న వాయిదా ఉన్నది. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఆతేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతటా మీకు పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది: 24.11.2025
//By Order of the Court//
సి. సుబ్బారెడ్డి,
వాది తరపు అడ్వకేట్,
జమ్మలమడుగు.

మహారాజశ్రీ గౌరవ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, కడప
O.S.No. 865 /2024
జానమద్ది సాహితి పీతమ్, రెప్రజెంటెండ్ బై జానమద్ది విజయ భాస్కర్, తండ్రి లేట్ హనుమంత శాస్త్రి, వయస్సు 68 సం॥లు, రిటైర్డ్ ఉద్యోగి, నివాసం డోర్ నెం. 1/1845, ఈ.పి.యఫ్. ఆఫీసు రోడ్డు ఎదురుగా, ఆర్.యస్. రోడ్డు, కడప నగరం, వై.యస్.ఆర్. కడప జిల్లా. **...వాది**
Vs
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ ఎంప్లాయిస్ మూట్చువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ త్రిఫ్ట్ సొసైటీ లిమిటెడ్, కడప, రెప్రజెంటెండ్ బై ఇట్స్ ప్రెసిడెంట్ పిడతల రాధా క్రిష్ణయ్య, తండ్రి పి. వెంకట శేషయ్య, నివాసం డోర్ నెం. ఈ -14- 241/001, యన్.జి.ఓ., కాలనీ, కడప నగరం, వై.యస్.ఆర్.కడప జిల్లా. **...ప్రతివాది**
నోటీసు
పై నెంబరు గల దావాలో ప్రదివాది అయిన నీపైన దావా డబ్బుల రాబట్టుకొనుటకు వాది సివిల్ దావా దాఖలు చేసియున్నాడు. నీవు నోటీసులు తీసుకొనకపోవడం వలన రాజశ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన కోరియున్నారు. కావున 26-11-2025 తారీఖున ఉదయం 10:30 గం॥లకు పై తెలిపిన కోర్టు యందు నీవు గానీ, నీ తరపున వకీలు గానీ, హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెయును లేనంతటా నీ పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది : 26-11-2025.
పి. రాంప్రసాద్ రెడ్డి
న్యాయవాది, కడప నగరం. సెల్ నెం.8985259609.

IN THE COURT OF THE HONORABLE SECOND ADDITIONAL DISTRICT JUDGE, KADAPA AT PRODDATUR
O.S.No. 4/2025
1. Muchumarri Venkata Siva Reddy, aged about 44 years, son of Venkata Subba Reddy, Business, residing at D.No.HIG-80-4, Housing Board Colony, Proddatur Town, Kadapa District.
2. Muchumarri Bhagya Lakshmi, aged about 29 years, wife of Venkata Siva Reddy, Housing Board Colony, Proddatur Town, Kadapa District. **...Plaintiffs**
Vs
Muchumarri Rama Subba Reddy, aged about 61 years, Son of Narayana Reddy, Cultivation, residing at D.No.26/895-1, Nagendra Nagar, Proddatur Town, Kadapa District. **...Defendant**
దావా సమను మరియు నోటీసు
పై నెంబరు దావాలోని వాదులు, ప్రతివాది పైన దావా షెడ్యూలు ఆస్తిపై హక్కు కోరుతూ మరియు పర్మనెంటు ఇంజక్షన్ కోరుచు, దావా దాఖలు చేసి అట్టి దావాతోపాటుగా పిటిషన్ షెడ్యూలు దాఖలా ఆస్తిలోనికి రెస్పాండెంట్ అయిన నీవు ప్రవేశించకూడదని I.A.No.93/2025గల పిటిషన్ దాఖలు చేసిఉన్నాము. అట్టి దావాలోను, పిటిషన్‌లోను ప్రతివాది/రెస్పాండెంట్ అయిన నీకు 5.12.2025 నాడు వాయిదా ఉంటుఉన్నది. అట్టి తేదీ నాడు ఉదయం గం॥10.30నిమిషములకు రాజశ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెల్పుకో వలసినది. లేనంతట నీ పరోక్షమందు తీర్మాణించబడును.
వాయిదా తేది: 5.12.2025
//By Order of the Court//
పి.చంద్రశేఖర్,
ఎమ్.శ్వేత
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.